క్లుప్తంగా

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: మండలంలోని రామవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు డ్రాయింగ్ టీచర్ ఎం.సత్యానందం తెలిపారు. ముంబైకి చెందిన రంగోత్సవ్ సంస్థ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాల్లో 8 గోల్డ్ మెడల్స్, 6 సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ఆయన చెప్పారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి మెడల్స్ సాధించిన విద్యార్థులను, డ్రాయింగ్ టీచర్ సత్యానందంను అభినందించారు.

ఫార్మసీ రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కరించండి



ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ రామ్మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న ఆదిరెడ్డి తదితరులు

అనపర్తి: ఫార్మసిస్ట్‌లకు ఫార్మసీ రిజిస్ట్రేషన్, రెన్యువల్ సమయంలో ఏర్పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఎస్.రామ్మూర్తికి ఇండియన్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు నల్లమిల్లి ఆదిరెడ్డి వినతిపత్రం అందజేశారు. గుంటూరులో ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్‌ను కలిసిన ఫార్మసిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఫార్మసిస్ట్‌లు వారి రెన్యువల్స్, రిజిస్ట్రేషన్ చేయించుకునే సమయాల్లో కాలయాపన జరుగుతోందని, దీంతో వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తోందని చెప్పారు. ఫార్మసిస్ట్‌ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ వినతి పత్రం అందించినట్లు ఆదిరెడ్డి తెలిపారు.

డీఏపీ కొరత లేదు

రాజానగరం: మండలంలో డీఏపీ ఎరువుకు కొరత లేదని, ప్రస్తుతం 130 టన్నుల వరకు నిల్వలున్నాయని మండల వ్యవసాయాధికారి పల్లా సురేష్ అన్నారు. కొందరు రైతులు గోదావరి డీఏపీ ఎరువు కోసం ఊళ్లు తిరుగుతూ ఖర్చులు పెంచుకుంటున్నారని, అయితే కంపెనీలు వేరైనా డీఏపీలన్నీ ఒక్కటేననే విషయాన్ని గ్రహించాలన్నారు. మండలంలో రబీనాట్లు చాలావరకూ పూర్తయ్యాయని, సంపత్ నగరం, కొండగుంటూరు, జి.యర్రంపాలెం పరిసర గ్రామాల్లో అక్కడక్కడా నాట్లు వేస్తున్నారన్నారు. ఈ కారణంగా ఆయా ప్రాంతాలలోని రైతులు గోదావరి డీఏపీని ద్వారపూడి, మండపేట ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారన్నారు. సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లోనూ, ఎరువుల దుకాణాల్లోనూ ఇతర బ్రాండ్‌ల డీఏపీ ఎరువులు ఎమ్మార్పీకే లభిస్తున్నాయన్నారు.

హాస్టళ్లలో సదుపాయాలు పెంచాలి



ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో బాలురకు సరిపడే స్థాయిలో వసతి గృహ సదుపాయాలు లేవని, వాటిని పెంచి సమస్యలను పరిష్కరించాలని భారత విద్యార్థి పరిషత్ (ఎస్ఎఫ్ఐ) ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం యూనివర్సిటీకి వచ్చిన రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డికి ఇన్‌చార్జి వీసీ ఆచార్య ప్రసాదరాజు సమక్షంలో వినతిపత్రం అందజేశారు. సరైన వసతి లేక విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డి.అశోక్ కుమార్, ఏకే రాము పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న పి.వీరలక్ష్మికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు చేతుల మీదుగా బుధవారం రూ.22 ఆర్థిక సాయం అందజేశారు. చిట్టిబాబు, అధ్యాపకులు కలిసి ఈ నగదును అందించారు.

లాల్ బహుదూర్ శాస్త్రికి ఘన నివాళి

బిక్కవోలు: కొంకుదురు ఉన్నత పాఠశాల వద్ద లాల్ బహుదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొవ్వూరి అమ్మిరెడ్డి మాట్లాడుతూ లాల్‌బహుదూర్ శాస్త్రి జీవితం నీతినిజాయతీలకు నిలువటద్దమన్నారు. విద్యార్థులు ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గొలుగూరి రామారెడ్డి, కృష్ణసాయి, ఈశ్వర రెడ్డి, వలీషా తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల్ని పరిరక్షించాలి

- ఎమ్మెలే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



శహపురంలో భోగి మంట వెలిగిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరముందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శహపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చండాళ్ల పార్వతి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల నాయకుడు చండాళ్ల వెంకటరమణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దంపతులు భోగి మంటను వెలిగించారు. అనంతరం నిర్వహించిన గొబ్బెమ్మ నృత్యం, మల్లయుద్ధం, కర్రసాము, చిన్నారులపై భోగి పళ్లు పోయడం, హరిదాసు కీర్తనలు తదితర ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఎమ్మెల్యే దంపతులు ఎడ్లబండి ఎక్కి సందడి చేశారు. బేస్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా క్రీడా దుస్తుల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, బుద్దాల శ్రీను, వనుం చినవెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. పుట్టకొండలో జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు ప్రారంభించారు.

అనపర్తి: గ్రామాలన్నీ ముందస్తు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు సందడి చేశారు. స్థానిక జీబీఆర్ విద్యా సంస్థల్లో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు కోలాట నృత్యాలు, హరిదాసు, గంగిరెద్దు, బుడబుక్కలు, కొమ్మదాసు, పిట్టల దొరల వేషధారణలు, ఆటపాటలతో కనువిందు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులకు విద్య, విజ్ఞానంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యం తెలియజెప్పాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, విద్యాసంస్థల అధినేత తేతలి కొండబాబు, డీస్ హరిప్రసాద్, బి.రత్నారెడ్డి, డీవీఆర్‌ఏ పాపిరెడ్డి, కె.హరినాథరెడ్డి, ఎన్‌పీ అబ్బాయిరెడ్డి, పీఆర్‌ఎల్ స్వామి, జి.కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: పందలపాక ఉన్నత పాఠశాల, కొమరిపాలెం పాఠశాలల వద్ద బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంప్రదాయ వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ మచ్చా పాప, రొంగల అప్పాజీ పాల్గొన్నారు.



బొబ్బిల్లంక హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు



కొమరిపాలెం పాఠశాలలో చిన్నారుల సంక్రాంతి సందడి

రంగంపేట: రంగంపేట భారతి యూపీ, ఎస్‌వీఎస్ పాఠశాలల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భారతి యూపీ స్కూల్ ప్రిన్సిపాల్ నందిగాం ఉమామని, ఎస్‌వీఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ అనూష ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, గొబ్బెమ్మలు పెట్టి, భోగి మంటలు వేసి నృత్యాలు చేశారు. రంగవల్లుల పోటీల్లో విద్యార్థినులు పోటీపడి మరీ ముగ్గులు వేశారు.

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు

పెదపూడి: ప్రజలంతా సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలను నిర్వహించుకోవాలని కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ అన్నారు. జి.మామిడాడలోని గమ్యం స్కూల్, జూనియర్ కాలేజీలో సంక్రాంతి సంబరాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హరిదాసు వేషధారణ, గొబ్బెమ్మ నృత్యం, భోగి మంట వెలిగించడం, సంప్రదాయ వస్త్రధారణ తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వాసు, స్కూల్ కరస్పాండెంట్ కర్రి శివారెడ్డి, కాలేజీ ఉపాధ్యక్షురాలు కర్రి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేట ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం గెడ్డం అరుణ కుమారి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయుడు ఎం.రామకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి పిల్లలకు భోగిపండ్లు పోశారు. చినకొండేపూడి సూర్యచంద్ర హైస్కూల్లో చైర్మన్ జి.కనికిరెడ్డి, కరస్పాండెంట్ కె.ప్రసన్నరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సీహెచ్ ఫణీంద్ర రావు పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరంలోని దివ్య, హర్షవర్ధన పాఠశాలలతోపాటు గైట్ ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలు, దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్, ఓక్‌వుడ్ తదితర స్కూళ్లలో సంక్రాంతి సంబరాలు జరిగాయి.



సంబరాల్లో భారతి యూపీ స్కూల్ విద్యార్థులు



బహుమతి అందజేస్తున్న సీఐ శ్రీనివాసు



రాజంపేటలో భోగిపండ్లు వేస్తున్న దృశ్యం

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో మూడోరోజు బుధవారం కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. రాజానగరం నియోజకవర్గస్థాయిలో జక్కంపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే జక్కంపూడి మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో భాగంగా ఈ పోటీలు జరుగుతున్న విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి నర్సాపురంపై ముక్కినాడ, వెలమపేట (సీతానగరం)పై శ్రీరాంపురం, ముగ్గళ్లపై కోటి, వెదుళ్లపల్లిపై కాటవరం విజయం సాధించాయని, రాధేయపాలెంపై గాడాల వాకోవర్‌గా నిలిచిందని రిఫరీ ఏవీడీ ప్రసాదరావు తెలిపారు. బుధవారం నరేంద్రపురంపై కోటి, ముక్కినాడపై చినకొండేపూడి, పురుషోత్తపట్నంపై కోటి, శ్రీరాంపురంపై కాటవరం విజయం సాధించాయి.

వాలీబాల్ పోటీలు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలో వాలీబాల్ పోటీలు ఫైనల్స్‌కు చేరాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకూ 8 టీమ్‌లు తలపడ్డాయి. రాత్రికి ఫైనల్ పోరు జరుగుతుంది.



గాడాలలో జరుగుతున్న వాలీబాల్ పోటీలు

జేసీఎస్ ఇంచార్జ్‌ల నియామకం

- నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వరుపుల సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు

అనపర్తి: నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో జగనన్న సచివాలయం కన్వీనర్స్ అండ్ గృహసారథుల(జేసీఎస్) మండల ఇంచార్జ్‌ల నియామకపు ప్రక్రియను పూర్తి చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వరుపుల సుబ్బారావు తెలిపారు. బుధవారం అనపర్తి విచ్చేసిన ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో మండలానికి ఒకరు చొప్పున జేసీఎస్ ఇంచార్జ్‌లను నియమించినట్లు చెప్పారు. అనపర్తి మండల ఇంచార్జ్‌గా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, అనపర్తి ఉపసర్పంచి చిర్ల వీర్రాఘవరెడ్డి, బొడ్డు ముత్యాలరావు(బిక్కవోలు మండలం), మేడిశెట్టి రవిశంకర్(రంగంపేట మండలం), కర్రి వెంకటరెడ్డి(పెదపూడి మండలం)లను నియమించినట్లు ఆయన తెలిపారు.

క్రీడలతో మానసిక వికాసం

అనపర్తి: మనోవికాసానికి, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని కుతుకులూరులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించే వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ నెల 14వ తేదీ వరకు టోర్నమెంట్ జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి ఎన్‌డీఆర్, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైఎస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రంగంపేట: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో అందించే వైద్య సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ డి.లావణ్య కోరారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం పెదరాయవరం రామాలయం వద్ద నిర్వహించిన శిబిరంలో ఆమె సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలో సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు గోకవరం ఎస్సై యువి శివనాగబాబు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. దేవీపట్నం మండలం చినభీంపల్లికి చెందిన పాట్నూరి అజయ్, కారం పండుదొర రంపచోడవరం మండలం ఫోక్స్‌పేట నుంచి బైక్‌పై సారా తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. ఈ దాడిలో వారి నుంచి 100 లీటర్ల సారా, బైక్, అల్యూమినియం పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపరిచారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

బిక్కవోలు: సంక్రాంతికి గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అనపర్తి సీఐ వి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన బలభద్రపురం, బిక్కవోలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ రోజుల్లో యువత కోడి పందేలు, పేకాట, గుండాట లాంటి అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. గతంలో కోడి పందేలు నిర్వహించిన ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.పోసిబాబు, ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సంతాపం

సీతానగరం: నల్గొండ గ్రామ రెవెన్యూ సహాయకుడు మద్దాల సూరయ్య గుండెపోటుతో మంగళవారం రాత్రి మరణించారు. ఈ నేపథ్యంలో బుధవారం సీతానగరంలో వారి సంఘ మండల అధ్యక్షుడు కన్నెం రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. మధుసూదన రావు, నాని, చిట్టియ్య, జ్యోతి, చిడిపి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

గోకవరం: వీరలంకపల్లి రామకృష్ణాగార్డెన్స్‌లో డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై బుధవారం శిక్షణ ఇచ్చారు. విద్యార్థినులు టి.యోగ్యత, జి.పూజిత, ఎం.ఇషిత, బి.తేజస్విని తదితరులకు ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి ఆధ్వర్యంలో జీవామృతం తయారీ, పంటల సంరక్షణ, మొక్కల పెంపకంపై శిక్షణ ఇచ్చారు.

పేకాడుతున్న 9 మంది అరెస్ట్

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో పేకాటాడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేశామని ఎస్సై కె.శుభశేఖర్ బుధవారం తెలిపారు. రఘుదేవపురం శివారున పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1,470 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం శివారున పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.3,600 స్వాధీనం చేసుకున్నామన్నారు.

కోడిపందేలపై దాడి

గోకవరం: కృష్ణునిపాలెం గ్రామ శివారున నిర్వహిస్తున్న కోడిపందేలపై బుధవారం గోకవరం పోలీసులు దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్నారనే ముందస్తు సమాచారం మేరకు ఎస్సై యువి శివనాగబాబు తన సిబ్బందితో దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.3650 నగదు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోకవరం: మండలంలోని గోకవరం-కొత్తపల్లి ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. గంగవరం మండలం ట్యాంకుబీడుకు చెందిన కరణం గోవిందు (29) బుధవారం రాత్రి బైక్‌పై పోలవరం వెళుతున్నాడు. ఈ క్రమంలో కొత్తపల్లి శివారున బైక్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టుని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన గోవిందు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై ఎంవీఆర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రజాసాధికారతే లక్ష్యంగా పథకాలు అమలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం



సంక్షేమ పథకాల లబ్ధి వివరాలున్న కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రజాసాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని పారదర్శకంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మూడోరోజు అనపర్తి బుల్లియ్యగారి తోటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి గడపలోనూ సంక్షేమ కాంతులు నిండుతున్నాయన్నారు. సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆశీస్సులు అందజేసి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి మూడేళ్లగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలతో సీఎం జగనన్న చేస్తున్న మేలు ఎప్పటికీ మరువలేమని, ఆయనకు అండగా ఉండి రుణం తీర్చుకుంటామని పలువురు స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన చైర్మన్‌గా నియమితులైన సబ్బెళ్ల కృష్ణారెడ్డి, డైరెక్టర్లు కోనాల సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్ వారా కుమారి, ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వరుపుల సుబ్బారావు, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, వైఎస్ ఎంపీపీ కర్రి దాసు, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ నల్లమిల్లి మురళీ మోహనబాలకృష్ణారెడ్డి, నల్లమిల్లి భాస్కరరెడ్డి, బాబుల్‌రెడ్డి, తేతలి వీరవెంకటసత్యనారాయణరెడ్డి, గొలుగూరి ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

రంగంపేట: మండలంలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సింగంపల్లి గ్రామంలో గ్రాసిం ఇండస్ట్రీస్ ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.